# పరిశోధకులు

(భారతి : 1933 మార్చి)

**కొ**న్ని ఏండ్ల క్రింద చెన్న రాజధానిలో హైస్కూళ్ళల్లో నాండీ టేల్డ్ టెక్స్టని (Non- detailed Text) నాలుగైదు ఫారాలకి రాజస్థాన కథలు కొన్ని పెట్టేవాళ్ళు ఇంగ్లీషులో. ఈ ఇంగ్లీషు స్కూళ్ళల్లో తెలుగు చెప్పే మేష్టర్లు కన్న తక్కిన సబ్జక్టులు చెప్పే మాష్టర్లూ, వాళ్ళకన్న యింగ్లీషు చెప్పే మేష్టర్లూ ఎక్కువని అందరికినీ తెలుసును కదా! ఆ యింగ్లీషు చెప్పే మేష్టర్లని చూస్తే పిల్లలకు హడలు. పరీక్షలో తప్పించటమో, ప్యాసు చేయడమో వాళ్ళ చేతుల్లో ఉండేది. పైగా యింగ్లీషు చెప్పే మాష్టరంటే పెద్ద పండితుడనీ, వాడి నోటి వెంబడి ఏదైనా వస్తే వేదాల్లో ముక్కైనా తప్పుతుంది గాని అది కాదని.

ఒక పల్లెటూరులో అక్కడ ఉన్న పెద్ద రైతులందరూ కలసి వాళ్ళు చాలా డబ్బు కలవాళ్ళు కావటం వల్ల క్రమక్రమంగా ఎలిమెంటరీ స్కూలల్లా హైస్కూలు చేయించారు. చెయ్యటం తోటే బస్తీ తయారు. దిగాలబడ్డ మొగాల్తో యింటికెళ్ళే మేష్టర్లు తయారు. పిల్లల అల్లర్లు తయారు. చదువు ఎక్కడి కక్కడికి మట్టం అయిపోయేది.

కాని యింగ్లీషు చదవటంతోటే మనదేశం ఎట్లా వున్నా సరే, ఇంగ్లాండు దేశం ఎట్లా వుందో దాన్ని గురించి హోరాహోరీ కుస్తీలు, మనభాష ఎట్లా ఉన్నా సరే, ఇంగ్లీషు బాగా వచ్చునా లేదా విద్యార్థులకు, దాన్ని గురించి తగాదా. ఒక చక్కని చంద్రమొద్దు వాడి ఖర్మం చాలక బాగా యింగ్లీషు వ్రాశాడా వాడు చాలా తెలివిగలవాడు. తెలుగులో ఎంత తెలివిగల వాడైనా యింగ్లీషు మార్కులు సరిగ్గా రాకపోతే తప్పించటమే.

ఆ వూళ్ళో ఐదవ ఫారానికి యీ రాజస్థాన కథలు టెక్స్టు–అనగా పాఠ్యపుస్తకం. ఐదవ ఫారంలో మూడు డివిజన్లు; రెండు డివిజన్లకు జి. రామచంద్ర రావు గారు యింగ్లీషు చెబుతాడు! ఒక డివిజన్‌కి యమ్. సీతారామయ్యగారు చెప్తారు. ఇద్దరూ బి.యే, యల్.టి.లే! అమోఘమైన తెలివితేటలు గలవాళ్ళే! అనగా బి.యే.యల్.టీలందరూ ఎంత తెలివిగల వాళ్ళో అంత తెలివిగలవాళ్ళు.

ఈ కథ యిట్లా వుండగా, ఆ రెండు డివిజన్ల వారికి రామచంద్రరావు గారంటే లార్డు క్లయివు (Lord Clive), వెల్లస్లీ (Wellesly) ప్రభువు. ఆయన్ని మించిన వాళ్ళు సృష్టిలో ఉండరు. మిగిలిన డివిజన్ల వారికి సీతారామయ్యగారన్నా అంతే!

ఇంక, వాళ్ళిద్దరికీ, ఒకళ్ళను చూస్తే ఒకళ్ళకి జలుబులు. రామచంద్రయ్య కన్న సీతారామయ్య–తనకు బాగా యింగ్లీషు వచ్చుననీ, తన యింగ్లీషు బెర్నార్డ్‌షా (Bernardshaw) కి ఫొటో అని. యథార్థానికి షా (Shaw) పుస్తకం ఒక్క టైనా ఆ ప్రభువు చదివిన పాపాన పోలేదు. రామచంద్రయ్యగారి ఉద్దేశం – మెకాలే (Macaulay) చచ్చి తనుగా పుట్టేనని. వాళ్ళిద్దరూ యింగ్లీషులో హేమాహేమీలు. సీతారామయ్యగారు Classical English గుత్త గొన్నాడనీ. రామచంద్రయ్యగారు Modern English గుత్త గొన్నాడనీ–ఇద్దరూ కలసి ఛాసర్ (Chaucer) దగ్గరనుంచి యింతవరకూ.

"వాడుట్టి Pedant, వాడి కేమొచ్చు యింగ్లీషు?" అని సీతారామయ్య మీద తోల్తాడు రామచంద్రయ్య. "ఈ వెధవకి is, was ఎక్కడ వెయ్యాలో కూడ తెలియదు" అని రామచంద్రయ్య మీద సవారీ తీస్తాడు సీతారామయ్య. ఇదంతా క్లాసులో పిల్లలముందు! మళ్ళీ యిద్దరూ కలుసుకుంటారా, 'ఏమండీ! రామచంద్రయ్యగారూ' అంటే 'ఏమండీ! సీతారామయ్యగారూ?' అన్న పలకరింపులూ.... ఇద్దరికీ చెరో పన్నెండేళ్ళ కొడుకులూ, ఇద్దరూ ఫస్టుఫారం చదువుతున్నారు. వారిద్దరూ సహాధ్యాయులు. వీళ్లిద్దరి భార్యలు యింటివద్ద స్నేహితురాండ్రు కనుక వీళ్ళ విరోధం యింగ్లీషుతోనే ఆగిపోయింది, తెలుగు దాకా పట్టలా. స్కూలుతోనే ఆగిపోయింది, యింటిదాకా పాకలా.

ఇంతకూ ఏతావతా కథ ఏమిటంటే! నాండిటైల్డ్‌లో Punna అని ఒక మనిసి వస్తుంది. ఆ పేరు ఒక ఆవిడది, ఆవిడ రాజపుత్ర స్త్రీ. ఆపదలో ఉండి ఆవిడ తన చేతి రుమాలు ఒక రాజపుత్రునికి బహుమానం పంపింది. ఆ చేతి రుమాలు ఎవరికి పంపితే వాళ్ళొచ్చి ఆవిణ్ణి ఆపదలోంచి రక్షించాలి. అది వాళ్ళ ఆచారం. అసలు కథ అది.

అసలు కథకూ మనకూ ఏమీ సంబంధం లేదు. ఆవిడ పేరు సీతారామయ్య "పన్నా" అని చెప్పాడు. రామచంద్రయ్య "పున్నా" అని చెప్పాడు. ఒక పదిరోజులయిన

తర్వాత సీతారామయ్య డివిజన్‌లోని ఒకడు రామచంద్రయ్య డివిజన్ వాడితో మాట్లాడుతూ "పన్నా" అన్నాడు. అక్కడ రామచంద్రయ్య డివిజన్ వాళ్ళు ఐదార్గురు ఉండి, వాళ్ళందరూ కలిసి వీణ్ణి ఏడిపించారు. "పన్నా ఏమిట్రా! double పన్నా, Single పన్నా" అని. అది సరిపోతుందా, ఆ కుర్రాడెక్కడ కనబడ్డా సరే రామచంద్రయ్య డివిజన్ వాళ్ళు "సింగిల్ పన్నా, డబుల్ పన్నా" అని కేకలెయ్యటం మొదలెట్టారు. వాడికీ ఒళ్ళు మండింది. వాళ్ళ డివిజన్ వాళ్ళని పదిమందిని పోగుచేసి యాగీ చేశాడు. అవతల వాళ్ళను ఏడిపించటం ఎట్లాగా అని వాళ్ళందరూ గూడుపుఠాణీ చేశారు. వాళ్ళ అదృష్టం కొద్దీ వాళ్ళ హైస్కూలు బంట్రోతు పేరు పున్నయ్య. ఇక రామచంద్రయ్య డివిజన్ వాళ్లు ఎక్కడ కనబడ్డా సరే, "బంట్రోతు పున్నాయి, బంట్రోతు పున్నాయి" అని వీళ్ళు కేకలెయ్యటం మొదలెట్టారు.

ఆవేశాలు బాగా పెరిగినై. క్రమంగా దెబ్బలాటల్లోకి దిగింది. అవతల డివిజన్ వాళ్ళు కనబడితే ఫౌంటెన్ పెన్ సిరా అంతా వాడి వీపు మీద map వెయ్యటం, Swan ink bottles ఆగలా. ఒక్కొక్కప్పుడు ముక్కులమీద గుద్దుకోటం, బక్కముండాకొడుకుల్ని రెక్కపుష్టి గలవాళ్లు దొంగ గుద్దులు గుద్దటం, హెడ్మాస్టరికి రిపోర్టులు వెళ్ళినై. ఆయన కొందరికి ఫైన్లు వేశాడు. కొందరికి ప్రహరణాల్తో సరిపోయింది. అంతటితో కుఱ్ఱాళ్ళల్లో సద్దు మణిగింది.

కాని అది "పన్నా?" "పున్నా?" రామచంద్రయ్య, సీతారామయ్యలకు తేల్లా, సీతారామయ్య ఓపిక కల మనిషి, అది "పన్నా" అని నిర్ధారణ చేద్దామనుకున్నాడు. ఆలోచించాడు. Todd's రాజస్థానం అంతా తిరగేశాడు. ఒకసారి బెజవాడ వెళ్ళితే గెజట్లూ తిరగేశాడు. లైబ్రరీలు గాలించాడు. ఎక్కడా ఆసరా చిక్కలా.

ఒకరోజున వాళ్ళ అబ్బాయి తెలుగు టెక్స్టు చదువుకుంటున్నాడు. అందులో యిల్లా చదివేడు కుఱ్ఱాడు. "శిశిరఋతువు వచ్చెను. వృక్షముల పర్ణములు రాలెను" అని. సీతారామయ్య యీ వాక్యం విన్నాడు. కుర్చీలోంచి ఎగిరి గంతేశాడు. "చిక్కిందిరా పట్టు" అన్నాడు. ఇంతలో వంట చేస్తున్న ఆయన పెళ్ళాం గాబరాపడి వచ్చింది. "ఏమిటేమిటి" అంది. ఏమిటీ లేదు గీమిటీ లేదు. సీతారామయ్య ఎగురుతున్నాడు. ఆవిడ మడి కట్టుకొని ఉంది పాపం, "ఏమిటి చెప్పండి,

తేలూ గీలూ ఏమైనా కుట్టిందా ఖర్మం" అంది. ఆయన "తేలూ లేదు ఏమీ లేదు. పర్ణ శబ్దం లోంచి పన్న అన్న శబ్దం పుట్టింద"న్నాడు. ఆవిడ కొంచెం గడుసరుల యింటిపిల్ల 'ఆ! అల్లాగుటండీ!' అని నోటిమీద చెయ్యివేసుకొని ఒకవిధమైన వెక్కిరింపు నవ్వుతో లోపలికి పోయింది. మొహం చూస్తే 'భలే మొగుడ్రా!' అనుకున్నట్టుంది.

సరే యింకా ఏం! ఈ పరిశోధన పిల్లలకు చెప్పి సవాలు విసిరేడు సీతారామయ్య. రామచంద్రయ్య కొంచెం మట్టి బుఱ్ఱ. అతగాడికి ఏమీ తోచింది గాదు సాధనం. ఒక నెలైం తర్వాత పున్నా శబ్దం మాత్రం ఏ సంస్కృత శబ్దంలోంచే పుట్టి ఉండకూడదా అనిపించింది. ఎందులోంచి వచ్చి వుండవచ్చునో మాత్రం తోచింది గాదు. గాబరా పడుతున్నాడు. పదిహేను రోజులకొకసారి కొత్త సవాలు వస్తూనే వుంది. చస్తాడూ?

రామచంద్రయ్యకి "బృహస్పతి" మంచి 'గడి' కి తిరిగేడు. వాళ్ళ బావమరిది తెలుగూ సంస్కృతం చదువుకున్న గడుసుపిండం. వాడికి యింగ్లీషు రాదు. రామచంద్రయ్య తను యింగ్లీషు చదువుకున్నానని నిక్కుపోతాడు. ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళు "సర్వ శూన్యంగాళ్ళ" ని వాడు లుస్కరిస్తాడు. ఆ రోజున వీళ్ళ యింటికి ఆయన చక్కా వచ్చేడు. భోజనం వేళ తాను B.A., L.T., ప్యాసైన దర్జా సహం చంపుకోని యీ కథ బావమరిదితో వెళ్ళబెట్టాడు. వాడు వెధవ పెంకె, వాడు "బావా! నీ బుద్ధి పుర్ణానుస్వారం" అన్నాడు. రామచంద్రయ్యకి అర్థం కావడానికి అనుస్వారం అడ్డు వచ్చింది. ఏవైపునా కైవారమే వత్తుకుంటోంది. మరి కాసేపు ఏడిపించి, బావమరిది "పూర్ణ" శబ్దంలోంచి "పున్న" వచ్చి వుండవచ్చు అన్నాడు. ఇంకా యేం రామచంద్రయ్యకు "చల్లా అన్నం" సయించలా, కాని స్కూల్లో యింగ్లీషు పీరియడు నాల్గో పీరియడుగ్గాని తగలడి చావలేదు. అందాకా "వెధవ నారదుడు" మల్లే "గుక్క పట్టుకోని క్లాసులోకి వెళ్లటం తోటే ఊదేడు. వారం రోజుల్లో 'పున్న' అన్న శబ్దం 'పూర్ణ' శబ్ద భవమా? 'పర్ణ' శబ్ద భవమా? తేలింది గాదు." ఎవరి కొమ్ములు వాళ్ళు కాశారు. ఈ వ్యవహారం తేలింది కాదు. క్రిస్టమస్ శలవలు వచ్చినై.

మద్రాసు పోయిన పెద్ద పరిశోధనా పండితులు (Research Scholars) ఉంటారు. వాళ్ళను పోయి యీ విషయం కనుక్కుంటే గాని తేలదనుకున్నారు యిద్దరు. ఇద్దరికీ బైటకు స్నేహమేగా! మద్రాసులో మూర్ మార్కెట్ (Market) చూడచ్చు, బీచ్ (Beach) ఒడ్డున షికారు కొట్టవచ్చు, ఎల్ఫిన్స్టన్ (Elphinstone) అలంకరించవచ్చు, కావలిస్తే గిండీ (Guindy)లో చిలుం వదుల్చుకోవచ్చు. ప్రధానంగా పెద్ద పరిశోధనా విషయం తేల్తుంది.

ఇద్దరూ కలసి ప్రయాణం కట్టారు. మర్నాడు బయల్దేరారు. బయల్దేరి వాకిట్లో కొచ్చారు. తాంబూలం నములుత్తూ! ఆ వూళ్ళో ఓ పిచ్చిదుంది. "ఈవూరు కొత్తగా వచ్చిన మేష్టర్లు చచ్చార్రోయి" అని కేక వేస్తూ ఎదురుగా వచ్చింది. 'ఛీ! వెధవ శకునం! అని ఆ రోజుకి ప్రయాణం ఉపసంహరించుకున్నారు. ప్రభువులు, చాదస్తానికి నిధులు!! మర్నాడు మళ్ళీ సావకాశంగా భోజనం చేసి, అటూ యిటూ ఎవ్వరూ లేరనిపించుకొని బయల్దేరారు. ఇంతలో గొడ్డు చస్తే రాబందు తయారయినట్లు – ఒక వెధవముండ తయారైంది. 'ధూ, ధూ' అనుకొని, ఆనాడు ప్రయాణం మానేశారు. మళ్ళీ మర్నాడు బయల్దేరారు. ఆరోజున తన యిద్దరు కొడుకులూ ఎదురుగా వచ్చేరు. ఉపనయనం కాకపోయినా యిద్దరినీ బ్రాహ్మలకింద లెక్కించి, శకునం బనాయించి బయల్దేరి బెజవాడ వెళ్ళేరు. బెజవాడలో కొంతసేపు కాలక్షేపం చేసి, మెయిలు ఎక్స్ప్రెస్ను పట్టారు పట్నంకి. బేసిన్ బ్రిడ్జి దగ్గరికి వెళ్ళేటప్పటికి యిద్దరికీ సహాధ్యాయి ఒకడు కనబడ్డాడు. వాడు పరమ అల్లరివాడు. వాడూ యల్.టీ ప్యాసయినాడు. "ఏరా, ఉద్యోగం ఎందుకురా?" అంటే "ఏదో పొట్టకురా" అంటాడు గాని, తానొక పెద్ద మహాకార్యం చేస్తున్నానని, విజ్ఞానం వెదజల్లుతున్నానని అనుకోడు, అనడు. అతడికి వెట్టి పుచ్చకాయ ముండాకొడుకుల్ని "పట్టించడం" పని. అంచేత వాణ్ణి చూడ్డం తోటే మన పరిశోధకులిద్దరికీ మొహం మాడింది. వాడు వదిలి పెడతాడూ? పలకరించాడు. వాడూ ఏదో Position లో ఉన్నాడు. Status కలవాడు కదా అని మాట్లాడేరు. పట్నంలో దిగి ఓ బండిలో కూర్చున్నారు. "ఎందుకురా పట్నం వస్తున్నారు" అని అడిగేడు వాడు. రామచంద్రయ్య పూసగుచ్చినట్టు చెప్పేడు. అంతా చెప్పి మద్రాసు బయలుదేరటం, మొదటిరోజున పిచ్చిది ఎదురుగా రావటం,

రెండవరోజున ముండ ఎదురుగా రావటం, మూడోరోజున కొడుకులు ఎదురుగా రావటం చెప్పి చివరకు ఎట్లాగైనా పట్నం వచ్చామయ్యా అన్నాడు. "వచ్చి ఏమి లాభం? పని యింటి దగ్గరే అయింది" అన్నాడు స్నేహితుడు. సీతారామయ్య తెల్లబోయి చూశాడు. 'ఇంటిదగ్గర ఏవైంద'న్నాడు. మీ పరిశోధనలకు సమాధానం యింటి దగ్గరే వచ్చింది గదా' అన్నాడు. మళ్ళీ యిద్దరూ గాబరా పడిపోయారు.

స్నేహితుడు – 'అయ్యో! తెలివి!!! మొదటి రోజున పిచ్చి, రెండవరోజున ముండ, మూడోరోజున కొడుకులూ' "పిచ్చి ... ముండా... కొడుకులు" అని యింటి దగ్గరే వస్తే ఎందుకురా?"

వాళ్ళిద్దరికీ వాడిని మింగుదామనిపించింది – కాని వాడే మింగగల్డు.